www.ninadam.co.in

నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం
20.6.2024

తెలంగాణ ప్రాంతీయం

## పాలేరుకు మూడేళ్లలోపే... ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- త్వరలోనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డు, పెన్షన్
- కూసుమంచి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




# పని ఒకరిది పేరు... మరొకరిది

**ఉపాధి హామీ పనుల్లో 2,47,416 రూపాయల గోల్మాల్**

- సామాజిక తనిఖీల్లో బయటపడిన బాగోతం
- ఫోర్జరీ సంతకాలతో మస్టర్లలో హాజరు
- గ్రామాల్లో కనిపించని పనిసూచిక బోర్డులు
- పట్నంలో ఉంటూ పల్లెలో ఉపాధి హాజరు
- ప్రత్యేక రంగాన్ని అడ్డం పెట్టుకొని బెదిరింపులు



**తుంగతుర్తి, జూన్19(నినాదం న్యూస్):** నాగారం మండలం లోని మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మూడవ విడత సామాజిక తనిఖీల్లో ప్రజావేదిక గురువారం నాగారం మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.వివిధ గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టిన అనంతరం మండల స్థాయిలో ఓపెన్ ఫోరంలో మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో హరితహారం,పంట కాలువ పనులు,నర్సరీలు వివిధ పనుల్లో పీడీ,గ్రామాల్లో కనిపించని పనిసూచిక బోర్డులను మధుసూదన్ రాజు రికార్డు లను 2023 నుండి 2024 వరకు చేసిన ఉపాధి పనులను తనిఖీ చేయగా ఉపాధి హామీ పథకంలో 247416 రూపాయల అవకతవకలు జరిగాయని గుర్తించారు. పని చేయని వారికి ఫోర్జరీ సంతకాలతో అధిక బిల్లులు రాసినట్టు అధికారులు గుర్తించారు. పట్నంలో ఉన్న వారికి కూడా పల్లెల్లో ఉపాధి హామీ పనుల్లో హాజరు వేసినట్టు, పే స్లిప్పులు కూలీలకు ఇవ్వకుండానే నగతు ఇష్టం వచ్చినట్లు పలు కాతలలోకి బదిలిచేశారని గుర్తించారు. ఉపాధి హామీ కార్డులో పేరు ఒకరిది ఉంటే మరొకరు పనికి వెళ్తున్నారని ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలలో జరిగిన సొమ్మును రికవరీ చేయాలని చేయని యెడల కేసులు నమోదు చేస్తామని తెలిపారు.అనంతరం పీడీ మధుసూదన్ రాజుకు మండలంలోని సీనియర్ మేట్లు పెండింగులో ఉన్న తమ వేతనాలను చెల్లించాలని,నూతన గ్రామ పంచాయతీ లో ఫీల్డ్ అశిస్టెంతులుగా గుర్తించాలని వినతి పత్రం అందజేశారు.సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం అన్నారు.

**ప్రత్యేక రంగాన్ని అడ్డం పెట్టుకొని పలు అధికారులను బెదిరిస్తూ...**

ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న ఒక వ్యక్తి ఒక ప్రత్యేక రంగాన్ని అడ్డం పెట్టుకొని పలు అధికారులను,ఉపాధి కూలీలను కూడా బెదిరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రత్యేక రంగాన్ని అడ్డం పెట్టుకొని పబ్బం గడుపుతున్న వ్యక్తి గురించి ఎంపీడీవో కి తెలిసిన ఎలా ఫీల్డ్ అసిస్టెంట్ గా కొనసాగుతున్నాడో అని అలాంటి వ్యక్తిని వెంటనే విదుల నుండి తొలగించి ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ శిరీష,ఎస్ టీ ఎం నరేందర్,ఎంపిడిఓ దార శ్రీనివాస్,ఎంపీపీ కూరం మణి,వైస్ ఎంపీపీ గుంట కండ్ల మణి మాల,ఎస్ ఆర్ పీ సాంబశివ చారి,ఏపీఎం రవికుమార్,పీ ఆర్ పీ లు,టీఏ లు,పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు

# దళారులను ఆశ్రయించవద్దు

- **ముస్సిపాలిటీలో పారదర్శక పాలనకు సిద్ధం**
- **నిత్యం ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ : ప్రతి సోమవారం ప్రజావాణి**
- **అక్రమ నిర్మాణాలపై సమాచారం అందిస్తే కఠిన చర్యలు:కమిషనర్ ఎండీ యూసుఫ్**



**మిర్యాలగూడ, జూన్ 19, (నినాదం న్యూస్):** దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించాలని, సమస్య ఏదైనా నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారంటూ మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ఎండి యూసుఫ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతానికి భిన్నంగా మున్సిపల్ కార్యాలయంలో మార్పులు జరిగాయని ఎలాంటి అనుమతులు కావాలన్నా, ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత రుసుము చెల్లించి నేరుగా అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.ముఖ్యంగా పెన్షన్,జనన మరణ ధ్రువీ కరణ పత్రాలు, నూతన భవనాల నిర్మాణం,నల్లా కనెక్షన్లు, మోటేషన్ తదితర అనుమతుల కోసం కొందరు గతంలో దళారులను ఆశ్రయించి వేల రూపాయల డబ్బును కోల్పోయే వారిని, కానీ ప్రస్తుతం మున్సిపాలిటీ కార్యాలయంలో పారదర్శక పాలన అందించేందుకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఉదయం 8:30 గంటలకే కార్యాలయంలోపలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజా వాణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.అక్రమ కట్టడాలు, నిర్మాణాలపై ప్రజలు తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. వాటిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా అదనపు నిర్మాణాలు చేపట్టిన, సెట్ బ్యాక్ లేకుండా రోడ్లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలపై జీవితకాలం రెట్టింపు పన్ను వసూలు చేస్తామని హెచ్చరించారు. రాబోయే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు ఏ వార్డులో సమస్యలు ఉన్న నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ వెంకన్న,టౌన్ ప్లానింగ్ అధికారి సోమేశ్ నాయుడు, ఆర్ ఓ. కళ్యాణి, మెప్మా అధికారి బక్కయ్య,ఎస్సై వెంకటరమణ, మోటేషన్ అధికారి కళ్యాణి, అకౌంటెంట్ ధనుంజయ్, జి దయాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ప్రజావాణి

- గ్రామస్థాయిలోనే వీలైనన్ని సమస్యలు పరిష్కారం కావాలి
- మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులకు దిశా నిర్దేశం : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి




**నల్గొండ బ్యూరో, జూన్ 19(నినాదం న్యూస్):** జిల్లాస్థాయిలో నిర్వహించినట్లుగానే ఇకపై ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మండలాల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రజావాణి కార్యక్రమ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు .ప్రతి సోమవారం మండల స్థాయి లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎంపీడీవో అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ, తహసిల్దార్, ఎంఈఓ, ఏపీఎం, వ్యవసాయ అధికారి, ఐకెపి అధికారి ,ఇతర మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలి. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి నిర్వహించాలి

# ముందస్తు ఫీజులు చెల్లిస్తేనే పై తరగతులకు అనుమతి

**ప్రైవేట్ పాఠశాలల ఇష్టాను రాజ్య దోపిడి - ఆత్మ న్యూనతకు గురవుతున్న విద్యార్థులు - పేద మధ్య తరగతి కుటుంబాలను వేధిస్తున్న అక్రమ ఫీజుల వసూలు**

**దోర్నకల్ జూన్ 19(నినాదం న్యూస్):** నూతన విద్యా సంవత్సరం మొదలైన నేపథ్యంలో పై తరగతి గదులకు వెళ్లి బోధన జరగటం పరిపాటి. అందుకు విరుద్ధంగా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు ఫీజులు చెల్లిస్తేనే పై తరగతులకు అనుమతిస్తున్నారు. దీంతో విద్యార్థులు సమరంగాపై తరగతులకు వెళ్లాల్సిన చిన్నారులు గత తరగతి గదిలోనే కూర్చుని ఆత్మన్యూనతకు గురవుతున్నారు. విద్యా సంవత్సరం మొదలై పది రోజుల్లో నడుస్తున్న నేటికీ గత సంవత్సరపు విద్యార్థులకు పాత తరగతి గదుల్లోనే విద్య బోధన జరుగుతుంది. నేటి వరకు పై తరగతులకు వెళ్లాల్సిన విద్యార్థులకు బోధన నేటికీ ప్రారంభం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత విద్యాశాఖ అధికారుల నిర్లిప్తత పేద మధ్య తరగతి కుటుంబాల తల్లిదండ్రులకు తీవ్రమైన ఆర్థిక భారం కలగచేస్తుంది. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సెయింట్ ఆగస్టు పాఠశాలలో ముందస్తు అక్రమ ఫీజుల వసులతోపాటు ప్రైవేటుగా పార్టీ పుస్తకాలు నోట్ పుస్తకాలు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు అర్జిస్తున్నారు.ప్రైవేటు పాఠశాలల దోపిడీ తమ విద్యార్థులను ఉన్నతమైన నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజు ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు పాల్పడుతున్నారు. తమ విద్యార్థులను ఉన్నతమైన నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజు ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు అవకాశంగా మారింది. ప్రతీవిభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు తెర తీశారు. పట్టణాల్లో చదవాలంటే హాస్టలు వసతి కూడా వారికి అవసరమవుతుంది. దీంతో స్కూలు, హాస్టల్ పేరుతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు, ఆ తర్వాత విద్యార్థులకు పాఠశాలను బట్టి రూ.60 వేల నుంచి




సుమారు లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే ప్రైవేట్ పాఠశాలల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని పరువురు పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**- వార్డులో రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నందుకు ఇద్దరు వార్డు బాయ్స్ సస్పెన్షన్ - ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ విధులకు గైర్హాజరైతే గట్టి చర్యలు తీసుకుంటామని డ్యూటీ డాక్టర్లకు హెచ్చరిక. - నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా విధులలో చేరిన మూడో రోజే కొరడా ఝుళిపించిన జిల్లా కలెక్టర్**

**నల్గొండ బ్యూరో, జూన్ 19(నినాదం న్యూస్):** బుధవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ, ఐసీయూ, పాలియేటివ్ కేర్, మేల్, ఫిమేల్ వార్డులు, సర్జికల్,పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఎం సి హెచ్ వార్డులన్నింటిని కలియతిరిగారు. ఆయా వార్డులలో రోగుల బంధువులతో ముఖాముఖి మాట్లాడి వారి పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు .ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని 5 రూపాయల భోజనం ఇస్తున్నారా లేదా? తాగునీరు ఎలా ఉంది ? టాయిలెట్లు బాగున్నాయా? ఎక్కడ పడుకుంటున్నారని అన్ని వివరాలను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. మేల్ సర్జికల్ వార్డులో ప్రతి పనికి డబ్బులు అడుగుతున్నారని రోగుల సహాయకులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ తీవ్రంగా స్పందిస్తూ కేవలం పేదలు మాత్రమే ప్రభుత్వాసుపత్రికి వస్తారని, ఆపదతో ఆసుపత్రికి వస్తే డబ్బులు అడుగుతారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ డబ్బులు అడిగిన ఇద్దరు వార్డ్ బాయ్ లను సస్పెండ్ చేశారు. డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది ఆయా వార్డులు,షిఫ్ట్ లవారీగా పనిచేసే వారి వివరాలను ఆస్పత్రి సూపరింటిండెంట్ ను అడగడమే కాకుండా హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేశారు .డ్యూటీ డాక్టర్లు డ్యూటీ సమయంలో ఆస్పత్రిలోనే అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, అందుబాటులో లేనట్లయితే వారిపై గట్టి చర్యలు తీసుకోవడమే కాకుండా, ఒకవేళ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నట్లయితే తొలగించడానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. అన్ని వార్డులలో డాక్టర్లతో పాటు, సిబ్బంది, నర్సులు వారికి కేటాయించిన షిఫ్ట్ సమయాలలో తప్పనిసరిగా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని ,విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని చేస్తేనే ఆసుపత్రిలో ఉండాలి, లేకుంటే ఉద్యోగం వదిలి వెళ్లిపోయిన తమకు ఎలాంటి ఇబ్బంది లేదని హెచ్చరించారు. పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రిలో మొత్తం ఎంతమంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారని ? ఆయా అవార్డులలో ఎన్నిసార్లు శుభ్రం చేస్తున్నారని అడిగారు. పారిశుధ్య సిబ్బంది కాంట్రాక్టర్ తో మాట్లాడుతూ అన్ని వార్డులు ఎప్పటికప్పు డు శుభ్రంగా ఉంచాలని, లేనట్లయితే కాంట్రాక్టును రద్దు చేస్తామని హెచ్చరించారు. పారిశుధ్య సిబ్బంది లేదా ఇతర సిబ్బం ది రోగుల నుండి డబ్బులు అడుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే జీతం నిలిపివేస్తామని,



రోగులను ,సహాయకులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాతా శిశు ఆరోగ్య విభాగాన్ని తనిఖీ చేసి ఇప్పటివరకు నిర్వహించిన ప్రసవాలు,సాధారణ ప్రసవాలు, ఆపరేషన్ ద్వారా జరిగిన ప్రసవాల సంఖ్య ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, ఆర్ ఎం ఓ ప్రశాంత్, డ్యూటీ డాక్టర్లు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# విద్య తోనే సమాజంలో సమానత్వం సాధ్యం

## విద్యాశాఖపై కలెక్టర్ సమీక్ష

**ఖమ్మం, జూన్ 19, ( నినాదం న్యూస్):** విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యకు తొలి ప్రాధాన్యతనిస్తామని అన్నారు. విద్యాశాఖలో ప్రాధాన్యత ఇవ్వవలసిన అంశాలపై ఆయన మార్గదర్శనం చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పాఠశాలలో అవసరమైన భౌతిక వనరులు, మౌళిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. సకాలంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం వంటివి అందిస్తున్నామన్నారు. విద్యార్థుల నమోదు శాతం, నిలకడ మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండేలా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఒక్కరోజు ఒక విద్యార్థి పాఠశాలకు గైర్హాజరైతే దానికి కారణం తెలుసుకొని ఒక రిజిస్టర్లో నమోదు చేయాలని, తరచుగా విద్యార్థులు గైర్హాజరైతే సంబంధిత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఆ విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, విద్యార్థి గైర్హాజరును తగ్గించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల హాజరు ఎంత ముఖ్యమో, ఉపాధ్యాయుల హాజరు కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ తమ విధి నిర్వహణను చేయాలని ఆయన అన్నారు. ఇకనుంచి ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును జిల్లా స్థాయి వరకు మానిటర్ చేయాలనికలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల నమోదు, నిలకడను పెంచడానికి పిటిఎం సమావేశాలు ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల పిటిఎం కు పూర్తిస్థాయి ప్రాధాన్యత నివ్వాలని కోరారు. పిటిఎం (పేరెంట్, టీచర్స్ మీటింగ్) లో చేపట్టవలసిన అంశాలను జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ కూడా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఒక వారం రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా బేస్ లైన్ టెస్ట్ నిర్వహించాలని, తదనంతరం క్లస్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, విద్యార్థుల నమోదు నిలకడ, బేస్ లైన్ టెస్ట్ ఫలితాలు ఇతర అంశాలపై చర్చించాలని తెలిపారు. అనంతరం మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయుల సమావేశాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. సోమశేఖర్ శర్మ, సీఎంఓ వై. రాజశేఖర్, ఏఎంఓ కె. రవికుమార్, కోఆర్డినేటర్లు రామకృష్ణ, భూలక్ష్మి , భాను ప్రకాష్, పాపారావు, డిఎస్ఓ జగదీష్, ఎంఈఓ లు, తదితరులు పాల్గొన్నారు.

### బాలానగర్ డిసిపిగా కే సురేష్ కుమార్



**కుత్బుల్లాపూర్, జూన్ 19 (నినాదం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ ల బదిలీలలో భాగంగా బాలానగర్ డిసిపి ఎంపికైన కే సురేష్ కుమార్ ఐపిఎస్ బుధ వారం తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.

# ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి: గోవిందు



**కొల్చారం జూన్19 నినాదం న్యూస్:**జిల్లా వ్యవసాయ అధికారి బుధవారం కొల్చారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా దుంపలకుంటలను పట్టిలైజర్ షాపులను తనిఖీ చేసి, విత్తనాల నాణ్యత, ఎరువుల పరిమాణం, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కాలం చెల్లిన విత్తనాలను కొనవద్దని, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్ని గంటలలో నాటిన పత్తి పొలాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, ఏ ఈ ఓ లు రైతులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో ఎస్సీ బాలుర వసతి గృహం

**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల నియోజవర్గ అధ్యక్ష కార్యదర్శులు, బేగరీ అరుణ్ కుమార్, శ్రీనివాస్**

**చేవెళ్ల జూన్ 19 (నినాదంన్యూస్):** మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు హాస్టల్లో వుంటూ చదువుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. అయితే వసతిగృహాలను అధికారులు పట్టించుకున్న పాపాన పోలేరు.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలోని ఎస్సి బాలుర వసతి గృహంలో సమస్యలు విలయ తాండవం ఆడుతున్నాయి. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ అరుణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలుర వసతిగృహం భవనం శిథిలావస్థకు చేరి స్లాబ్ పెక్కులు ఊడి కింద పడుతున్నాయని దానికి విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతు న్నాన్నయని, అలాగే వసతి గృహంలో బోరు పనిచేయడం లేదని నీటి సమస్య కూడా ఉందని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకుల దృష్టికి తీసుకువచ్చారని అన్నారు.జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టల్ భవనాన్ని సందర్శించి నూతన భవనం మంజూరు చేయాలని లేదా మరమ్మత్తులు చేయాలని నీటి సమస్య పరిష్కారం చేసే విధంగా చొరవ చూపించాలని కోరారు.లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్ వసతిగృహం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలు వేసుకోవాలి: అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

**రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 19 (నినాదం న్యూస్):** ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి ఈ నెల 20న తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సూచించారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెన్ డజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో కరపత్రాలు, గోడప్రతులను అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నులి పురుగుల వల్ల పిల్లలలో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు వారు లోనవుతారని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి అల్బెన్ డజోల్ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి జూన్ 27వ తేదీన అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8 లక్షల 9 వేల మంది పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడానికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1774 మంది ఆరోగ్య సిబ్బంది మరియు అంగన్వాడీ సిబ్బందితో టీచర్లను సమన్వయం చేసి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయించేలా అవగాహన కలిగించాలని, గ్రామాలలో టామ్ టామ్ ద్వారా తెలియ చెప్పాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఎస్సీఎస్టీ ,బిసి, మైనారిటీ హాస్టల్ లలో, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాలలో వంద శాతం పిల్లలకు టాబ్లెట్స్ వేసేలా కార్యాచరణ ఉండాలని, ఆరోజు పిల్లలు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నం తిన్న తరువాత ఒకటి నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్ పొడి చేసి, 2 నుండి 3 సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ పొడి చేసి 3 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర నమిలి మింగే విధంగా వేయాలని సూచించారు. పిల్లలకు మాత్ర వేయగానే తాగేందుకు తగిన త్రాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అన్ని జాగ్రత్తలు తీసుకొని వంద శాతం ఆల్బండజోల్ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం నూటికి నూరు శాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్యాశాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

**బిసిజి వ్యాక్సిన్ కు ఇంటింటి సర్వే ...** క్షయ వ్యాధిని నివారించుటకు వయోజనులకు బి.సి.జి వ్యాక్సిన్ వేయడానికి ఇంటింటి సర్వే నిర్వహించాలని వైద్య అధికారులను అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశించారు. 18 సంవత్సరముల వయస్సు పైబడిన వ్యక్తులకు, 60 సంవత్సరముల వయస్సు పైబడిన వృద్ధులకు, పొగ తాగే వారికీ, టి.బి. వ్యాధిగ్రస్థులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వారికి, గత 5 సంవత్సరాలలో టి.బి. వ్యాధి సోకిన చరిత్ర కలిగిన వారికి బి.సి.జి వ్యాక్సిన్ ఇవ్వవచ్చని తెలిపారు. 18 సంవత్సరముల వయస్సు తక్కువ ఉన్న వ్యక్తులకు, కాన్సర్ ఉన్న వ్యక్తులకు, హెచ్.ఐ.వి తో జీవిస్తున్న వారికి, గర్భిణి లేదా పాలు ఇచ్చే స్త్రీలకు, గతం 3 నెలలో రక్త మార్పిడి చరిత్ర కలిగిన వ్యక్తులకు, అనారోగ్యంతో ఉన్న వారికి బి.సి.జి వ్యాక్సిన్ ఇవ్వకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, జెడ్పి సీఈఓ కృష్ణ రెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా ఇమ్యూనైజెషన్ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, సంబంధిత జిల్లా అధికారులు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తిర్యాణి మండలాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలి!

## జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి (నినాదం న్యూస్ )** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా,తిర్యాణి మండలాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానం లో నిలిచేలా అధికారులు కృషి చేయాలని నీతి అయోగ్ సమీక్షా కార్యక్రమంలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం తిర్యాణి మండలం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నీతి ఆయోగ్లో ఉన్న 39 అంశాలపై జిల్లా, మండల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీతి ఆయోగ్ కార్యక్రమంలో రాష్ట్రంలో 8 మండలాలను ఎంపిక చేయగా అందులో తిర్యాణి మండలం ఒకటి అని తెలిపారు. తిర్యాణి మండలాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలని అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్లోని విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ఆర్థిక చేకూర్పు మొదలైన ఐదు విభాగాలు 39 అంశాలపై పనిచేస్తున్నాయన్నారు. ఈ ఐదు విభాగాలు ఇతర శాఖల అధికారులతో సమన్వయంచేసుకుంటూ మండలాన్ని అభివృద్ధిపథంలో తీసుకువెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం భట్, సురేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, సీడీపీవో సాదియా రుక్సానా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలేరుకు మూడేళ్లలోపే... ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

**పాలేరు జూన్ 19(నినాదం న్యూస్):** పాలేరు నియోజకవర్గంలోని ఇళ్లులేని పేదలందరికీ మూడేళ్లలోపే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలం జీళ్లచెర్వు, కేశవాపురం, ధర్మతండా, పోచారం, కిష్టాపురం, పాలేరు, ఎర్రగడ్డ తండా, నర్సింహులగూడెం, సంధ్యా తండా, లాల్ సింగ్ తండా, గెగోళ్ళపల్లి, చౌటపల్లి, బోడియా తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలేరు ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారని వారి రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. అతి కొద్దిరోజుల్లోనే అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లను అందిస్తామని తెలిపారు. వచ్చేనెల నుంచి రైతు రుణమాఫీని అమలు జరుగుతుందని పేర్కొన్నారు. పేదోళ్ల ప్రభుత్వంలో పేదవారి కోరికలు అన్ని తీరుతాయన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజి లను మొదటి ఏడాదిలోనే పూర్తి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రతీ ఒక్కరి సమస్యను తీరుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో పొంగులేటితో పాటు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కూసుమంచి మండలంలోని పలువురు కల్యాణలక్ష్మి లబ్దిదారులకు పాలేరు గ్రామంలో చెక్కులను అందించారు.

# పకడ్బందీగా ప్రజావాణి

ఫిర్యాదుదారులు సమర్పించే ప్రతి ఫిర్యాదును పూర్తిగా చదవాలి.ఫిర్యాదుదారుకు ఫిర్యాదు పరిష్కారంపై స్పష్టంగా వివరణ ఇవ్వాలి. పరిష్కారం అయ్యేవి వెంటనే పరిష్కరించాలి .లేనట్లయితే పై స్థాయికి పంపించేది, ఒకవేళ పరిష్కారం కానిదైతే పరిష్కారం కాదని స్పష్టంగా తెలియజేయాలి. ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇవ్వాలి. మండల స్థాయిలో పరిష్కారం కానీ ఫిర్యాదులు 15 రోజుల తర్వాత మాత్రమే జిల్లా స్థాయి ప్రజావాణికి రావాలి. మండల స్థాయిలో ప్రజావాణి పకడ్బందీగా నిర్వహించేందుకు ముందుగా సరైన వేదికను తక్షణమే గుర్తించాలి. అక్కడ పబ్లిక్ అడ్రస్ సిస్టంతో సహా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి లి ఒకసారి వచ్చిన దరఖాస్తు దారుడు మళ్లీ ప్రజావాణి కి రాకుండా చూసుకునే బాధ్యత మండల స్థాయి బృందంపై ఉంది. వచ్చిన ఫిర్యాదులన్నింటిని ప్రజావాణి వెబ్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలి. ప్రతి దరఖాస్తుకు ఒక ఐడి నెంబర్ను జనరేట్ చేయాలి. డేటా ఎంట్రీ ఆపరేటర్లు అందరికీ ఈ విషయంపై శిక్షణ ఏర్పాటు చేయాలి. ప్రజావాణిలో అత్యవసర కేసులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి మండల స్థాయిలో 15 రోజులు దాటిన పరిష్కారం కానివి, ఎమర్జెన్సీ కేసులు,నేరుగా జిల్లా ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల కు జిల్లా స్థాయిలో రెండో ప్రాధాన్యత కింద తీసుకోవడం జరుగుతుంది ప్రజావాణి నిర్వహణ విషయమై మండల స్థాయిలో వెంటనే మండల టీము మరియు వివిధ శాఖల అధికారులతో తక్షణ సమావేశం ఏర్పాటు చేయాలి జిల్లాలోని 33 మండలాలు, నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ రెవెన్యూ డివిజన్లలో వచ్చే సోమవారం ప్రజావాణి నిర్వహించాలి. ప్రజావాణి కార్యక్రమం పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి లి ప్రత్యేకించి మండల స్థాయిలోనే ప్రజావాణి ఫిర్యాదులన్నీ పరిష్కారం అవుతాయని,జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పని లేదని ప్రజలకు తెలియజేప్పాలి మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారులు ప్రజావాణితోపాటు, పథకా ల అమలులో జిల్లా యంత్రాంగానికి కళ్ళు, చెవులుగా పనిచేయాలి ప్రజాపాలనపై ప్రజల్లో నమ్మకం కలిగించేలా పనిచేయాలి. జిల్లా స్థాయికి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులు సాధ్యమైనంత వరకు తగ్గిపోవాలి. ప్రజలకు ఎక్కడికక్కడే వారి సమస్యలకు పరిష్కారం దొరకాలి.కింది స్థాయిలో పరిష్కారం దొరకని ఫిర్యాదులు మాత్రమే జిల్లా కేంద్రానికి వచ్చేలా ఉండాలి .స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం, జూన్,19, (నినాదం న్యూస్):** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్, స్థానిక జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శించి జనరల్, శస్త్ర చికిత్స విభాగాలు, ప్రసూతి వార్డులలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను స్వయంగా రోగుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాతాశిశు కేంద్రంలోని కుటుంబ నియంత్రణ, ఎఎన్సి ఓపి, స్కానింగ్ గదులను పరిశీలించారు. ప్రతిరోజు ఎంతమంది వస్తున్నది, ఏ ఏ సేవలు అందిస్తుంది అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డుల్లో బాలింతలను వైద్య సేవల గురించి, భోజనం గురించి, సిబ్బంది పట్టింపు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల సహాయకులతో ఆసుపత్రిలో సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల సహాయకులు సేవలు చాలా బాగున్నట్లు, వైద్యం మంచిగా అందుతున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నమోదులు ఎన్ని అయినవి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా ఆసుపత్రి పర్యవేక్షకులు డా. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. అమర్ సింగ్, డా. రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# డివైడర్ కు ఢీకొన్న బైక్ వ్యక్తి మృతి

**కొల్చారం జూన్ 19 నినాదం న్యూస్:**మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారులోని దుర్గా వైన్స్ ఎదురుగా డివైడర్ కు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాడు చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం 19.06.24 మధ్యాహ్నం అందాజ రెండున్నర గంటలకు కొడపాక గ్రామానికి చెందిన పెద్దపులి బాబు తండ్రి బాలయ్య వయసు 35 సంవత్సరాలు అనునతను తన యొక్క హీరో స్ప్లెండర్ ప్లస్ నంబర్ %ం +ూ% 9750 గలదానిపై వస్తుండగా ఏడుపాయల %ు% జంక్షన్ దగ్గర గల దుర్గా వైన్స్ ఎదురుగా తన బండిని అతివేగంగా అజాగ్రత్తగా నడిపి వైన్స్ ముందర గల డివైడర్ కు గుద్దుకొనగా బైక్ రైడర్ అయినా పెద్దపులి బాబు తలకి తీవ్రత గాయాలు కాగ్గా అక్కడికక్కడే మరణించినాడు. ఇట్టి ప్రమాదంపై మృతుని తమ్ముడైన డబ్బులి ప్రవీణ్ తండ్రి బాలయ్య గారి ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్సై గారు కేసు నమోదు పరిచి విచారణ జరుగుతుందన్నారు.

# ఫోటోగ్రాఫర్‌కి ఆర్థిక సహాయం



**భీమదేవరపల్లి జూన్ 19 (నినాదం న్యూస్)** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన చెప్యాల మహేందర్ రెడ్డి కి హుజురాబాద్ కు ఈవెంట్ కి వెళ్లి వస్తుండగా బైక్ ఆక్సిడెంట్ జరిగింది. ఈ ఆక్సిడెంట్ లో తనకి వెన్నెముక కి తీవ్ర గాయం అయి దెబ్బతింది. వెన్నెముక కి ఆపరేషన్ చేశారు. ఇంకా చికిత్స చేయాల్సి ఉంది. ముల్కనూర్ వీరభద్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ నుండి11.000/- ఆర్థికం సహాయం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల యూనియన్ అధ్యక్షులు అరపెల్లి. తిరుపతి, కార్యదర్శి గజ్జెల. శ్రీకాంత్, ఉపాధ్యక్షులు కొంగొండ. సమ్మయ్య, కృష్ణమూర్తి, రాహుల్, కుమార్, హరినాథ్, అనిల్, చరణ్, రఘు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల తవ్వకాల కలకలం

**- ముల్కనూర్ శివారులో రావులమ్మ గుడి నేలమట్టం**

**- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**



**భీమదేవరపల్లి జూన్ 19 (నినాదం న్యూస్):** సులభంగా డబ్బు సంపాదించాలని కొందరు వ్యక్తులు అడ్డదారులు తొక్కుతున్నారు. చివరికి అవి ఫలించకపోగా చిక్కుల్లో పడుతున్నారు. ఇలాంటి ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ముల్కనూర్ శివారులో ఓ మామిడి తోటలో గత రెండు రోజుల క్రితం గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన గుప్త నిధుల వేట పై మండలంలో జోరుగా చర్చ సాగుతోంది. మండలంలోని ముల్కనూర్ కు చెందిన ఓ రైతు మామిడి తోటలోని పురాతన రావులమ్మ గుడి కింద గుప్తనిధులు ఉన్నాయనే ఆశతో తవ్వకాలు జరిపారు. మండలంలోని విశ్వనాథ కాలనీ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జెసిబి సాయంతో తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. మామిడి తోటలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని సదరు తోట యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు పొక్కిందని స్థానికుల ద్వారా తెలుస్తుంది. ముల్కనూర్ గ్రామానికి చెందిన నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

# రేపు జర్నలిస్ట్ యూనియన్ సమావేశం

**మండల యూనియన్ బాధ్యులు మాట్ల హరికుమార్**

**భీమదేవరపల్లి జూన్ 19(నినాదం న్యూస్)**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రేపు జర్నలిస్ట్ యూనియన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు యూనియన్ బాధ్యులు మాట్ల హరికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముల్కనూర్ రైతు వేదిక వద్ద జర్నలిస్ట్ యూనియన్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలో కొత్త పాలసీ తీసుకువస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారని తెలిపారు. కాగా కొత్త పాలసీని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఐక్యంగా ఉండవలసిన అవసరం ఉందని, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చించనున్నట్లు స్పష్టం చేశారు. మండలంలోని జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



**మల్యాల జూన్ 19 (నినాదం న్యూస్)** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మల్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సోనియాగాంధీ ఆలయం వద్ద జరిగిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు దొంగ ఆనందరెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెరువు మత్తడి పునర్నిర్మాణం అభినందనీయం



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19 (నినాదం న్యూస్)**మంచిర్యాల పట్టణంలోని పోచమ్మ చెరువు మత్తడి ప్రాంతంలో జరిగిన విధ్వంసాన్ని బుధవారం ఇరిగేషన్ శాఖ,మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కలిసి మత్తడి ప్రాంతాన్ని పునఃనిర్మాణం చేశారు.ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు తుల మధుసూదన్ రావు మాట్లాడుతు చెరువులో నీటిని బయటకు పంపించి చెరువులు కబ్జా చేయాలనే కుట్ర చేసిన కొంతమంది రియల్ ఎస్టేట్ మాఫియా చేసిన విధ్వంసంపై గతంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ సంబంధిత అధికారులు చొరవచూపి మత్తడి ప్రాంతాన్ని తిరిగి పునఃప్రారంభంచారని అన్నారు.గత ప్రభుత్వంలో పాలకులు,అధికారులు చెరువులను కుంటలను పట్టించుకోకపోవడం వల్ల చెరువులు పెద్ద ఎత్తున కబ్జాలకు, విధ్వంసానికి గురయ్యాయని అన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెరువులను రక్షించాలని ప్రత్యేకమైన జిఓలను తీసుకువచ్చి చెరువుల హద్దులను, ఎఫ్‌టిఎల హద్దులను శిఖం భూములను గుర్తించి,జియో ట్యాగుతో పక్క ప్రణాళి కలతో చెరువులను రక్షించాలనే ఆలోచనలను తాము స్వాగతిస్తున్నామని అన్నారు.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుకూ లంగా నీటిపారుదల శాఖ,రెవెన్యూ శాఖ,మున్సిపల్ శాఖ అధికారులుతో పాటు స్థానిక శాసనసభ్యులు,స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం ఇచ్చిన జిఓ ను రక్షిస్తు దానికి అనుగుణంగా పక్కా ప్రణాళికలతో పని చేయాలని కోరారు. చెరువులను కాపాడుకుంటేనే భవిష్యత్తులో నీటి ఎద్దడి రాకుండా నివారించే అవకాశం ఉందని,మంచిర్యాల పట్టణంతో పాటు మంచిర్యాల జిల్లాలో చెరువులను కాపాడుకున్నట్లయితే భూగర్భ జలాలు విపరీతంగా పెరుగుతాయని, స్వచ్ఛందంగా ప్రజలు బాధ్యత గల వ్యక్తులు చెరువులను కాపాడుకునే పని చేపట్టాలని పిలుపునిచ్చారు. పోచమ్మ చెరువుకు జరిగిన నష్టాన్ని పూడ్చేదిశలో బాధ్యత వహించి పునఃనిర్మాణ పనులు చేపట్టిన అన్ని శాఖల అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.జిల్లా ప్రజలు కూడా తమ ప్రాంతంలో ఉన్న చెరువులను కాపాడుకోవడానికి కమిటీలు వేసుకొని చెరువు కబ్జాలు కాకుండా కంటికి రెప్పలా కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎఈ గౌతం,బల్ల శివశంకర్,సోమ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆకెనపల్లి మండల పరిషత్ పాఠశాలలో అక్షరాభ్యాసం

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను ముగించుకుని నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు బుధవారం అక్షరాభ్యాసం చేయించినట్లు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి జెరిపోతుల తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ బాసర సరస్వతి అమ్మవారి ఫోటోకు పూలమాలలు అలంకరించి వేద పండితులు,ప్రధాన అర్చకుడితో పూజలు నిర్వహించి నూతన విద్యార్థులకు పలకలపై పురోహితునితో,బెల్లంపల్లి మండల నోడల్ ఆఫీసర్ సాదు లింగయ్య లతో అక్షరాభ్యాసం చేయించారు.అనంతరం వారు మాట్లాడుతు పిల్లల భవిష్యత్తు మంచి మార్గంలో విద్యాబుద్ధులతో వీరా జిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు ప్రధాన అర్చకులు రాంపల్లి అశోక్ శర్మ,ఉపాధ్యాయురాలు జ్యోతి,అంగన్వాడి టీచర్ లు సత్యమ్మ,పద్మ,విద్యార్థులు పూర్వ విద్యార్థులు గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 2వ వార్డులో పరిసరాలను శుభ్రం చేయించిన టిఆర్ఎస్ నాయకులు



**బెల్లంపల్లి జూన్ 19 (నినాదం న్యూస్)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 2వ వార్డులో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను బిఆర్ఎస్ పార్టీ వార్డు ఇంచార్జి సబ్బని అరుణ్ బుధవారం పరిశుభ్రం చేయించారు.వార్డులోని పలు విధులలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉండడంతో బస్తీ వాసులు ఆయనకు సమాచారం అందించగా వెంటనే కూలీలను ఏర్పాటు చేసి తన స్వంత ఖర్చులతో పరిసరాలు శుభ్రం చేయించడం అభినందనీయమని స్థానిక వార్డు ప్రజలు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రోడ్డు పనులు అడ్డుకుంటున్న బిఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన స్థానిక బిఆర్ఎస్ నాయకుని వలన మండలంలోని బుచ్చయ్యపల్లి నుండి మందమర్రి కి వెళ్లే రోడ్డు పనులను సంబంధిత అధికారులు నిలిపివేసినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుదవారం పలువురు గ్రామస్తులు మాట్లాడుతు బుచ్చయ్యపల్లి నుండి మందమర్రి కి 2కోట్ల 85లక్షలు 2 కిలోమీటర్ల 300మీటర్లు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.ఈ రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు కావడంతో బుచ్చయ్యపల్లి, పెద్దదుబ్బ, ఆకెనపల్లి గ్రామాల మార్గంలో వెళ్లే ప్రజల ఇబ్బందులు తొలిగిపోయాయని, గత 50సంవత్సరాలుగా తాము ఎదురుచూస్తున్న కల నెరవేరిందని గ్రామస్తులందరు రోడ్డు పనికి సహకరించారు. కానీ బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడైన యాదనవేని రాజయ్య తన పొలం కంచె కోసం రోడ్డుపైనే టేకు చెట్లు నాటి భవిష్యత్తులో ఈ రోడ్డు వస్తుందని గమనించి తనకున్న బిఆర్ఎస్ నాయకుల అండదండలతో మంచి టేకు చెట్లు నరికించి,పనికిరాని టేకు చెట్లను రోడ్డుపైనే ఉంచి వాటికోసం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోడ్డు పనులు జరగకుండా అడ్డుకుంటు గ్రామస్తులపై కేసులు పెట్టడానికి రాజకీయంగా కుట్రలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.అందరికీ అవసరమైన రోడ్డు పనులను అడ్డుకుంటున్న అతనిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19 (నినాదం న్యూస్):** బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు.బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కౌన్సిలర్ లు,మహిళా నాయకులు,కార్యకర్తలు,ఎస్సి సెల్,బిసి సెల్,మైనార్టీ సెల్,యూత్ కాంగ్రెస్,ఎన్ ఎస్ యు ఐ,సేవాదళ్,ఐఎన్టియూసి అనుబంధ సంఘాల నాయకులు,అభిమానులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు.అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర,ఆయన గణనీయమైన సేవలు భావితరాలకు చాలా ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన 6గ్యారంటీ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడం కోసం ఆయన కూడా చేసిన కృషి తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెయిన్ కెనాల్ నుండి పాలేరు పాత కాలువకు నీళ్లు ఇవ్వాలి

*ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పొంగులేటి ప్రసాద్ రెడ్డికి రైతులు వినతి*



**పాలేరు జూన్ 19(నినాదం న్యూస్):** నేలకొండపల్లి మండలం నేలకొండపల్లి, మెయిన్ కెనాల్ నుండి పాలేరు పాత కాలువకు నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడిని చెన్నారం, మండ్రాజుపల్లి, కొత్తూరు, రామచంద్రాపురం, సుర్దేపల్లి, పైనంపల్లి బొదులబండ గ్రామాలకు చెందిన రైతులు కోరారు. పాలేరు పాత కాలువకు నీళ్లు సరిగా రాకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు ప్రసాద్ రెడ్డికి వివరించారు. రాజేశ్వరపురం గ్రామం వద్ద మెయిన్ కెనాల్ మరియు పాలేరు పాత కాలువకు అనుసంధానం చేస్తూ పైపులు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మరింత న్యాయం చేయాలని కోరారు. తద్వారా ఎండా కాలంలో తాగునీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా ఉంటుందని చెప్పారు. కాలువలకు అనుసం ధానం చేస్తూ ఓవర్ టన్నల్ కడితే రైతులకు మరింత న్యాయం చేసిన వారవుతారని అన్నారు. గత ఇరవై సంవత్సరాలుగా ఈ ప్రపోజల్ ఉన్నప్పటికీ కార్యచరణ దాల్చలేదని ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకె ళ్లారు. దీంతో పది గ్రామాలకు చెందిన రైతుల ఆరు వేల ఎకరాల భూమి ఎండిపోకుండా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పాలేరు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీతారామ ప్రాజెక్టు ద్వారా మరియు మున్నేరు నుంచి గ్రావిటీ ద్వారా కూడా పాలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుం దని అన్నారు. రైతుల వినతిని మంత్రి దృష్టికి తీసుకెల్తానని అన్నారు. ఈ కార్యక్ర మంలో రైతులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, యడవల్లి సైదులు, సూరపనేని రామకృష్ణ, తలసీల గోపి, చింతని పు సైదులు, కుక్కల హనుమంతరావు, వందనపు నాగేశ్వరరావు, నెల్లూరి అప్పారావు, వజ్జా శ్రీను, యర్రా బాబు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**అల్వాల్, జూన్ 19 (నినాదం న్యూస్)** ఘనంగా మాజీ ప్రదాన మంత్రులు, శ్రీమతి ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ, గార్ల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని వారి ఆలోచన విదానంతో దేశవ్యాప్తంగా నమ్మిన సిద్దాంతాం ప్రకారం, తన మార్పు మూర్తి శ్రీమతి సోనియా గాంధీ అడుగు జాడల్లో కేంద్ర కాంగ్రెస్ పార్టీని ముమ్మదుకే నడిపిస్తున్న గౌరవనీయు లు , కేంద్ర కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పక్షనేత,శ్రీ రాహుల్ గాంధీ గారి 54వ జన్మదినాన్ని,గౌరవ డైనమిక్ నాయ కుడు,తెలంగాణ టైగర్,శ్రీ మైనంపల్లి హనుమంత్ రావు సూచన ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు టేంపుల్ అల్వాల్ దగ్గర క్రీ"శే"లు రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర ఏ-బ్లాక్ అల్వాల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విగ్రహానికి పువ్వుల మాల వేసి, కేక్ కట్ చేసి,అరటి పంపిణీ చేశారు..ఈ కార్యక్రములో టి.లక్ష్మీకాంత్ రెడ్డి, సి.యల్. యాదగిరి, క్రిష్ణ గౌడ్, చిట్టిబాబు,సురేందర్ రెడ్డి,శివశంకర్, నాగేశ్వర్ రావు,శ్రీశైలం,నరేష్, శ్రీమతి శకుంతల నాయుడు,యేన్న%శీ%నేనీ విష్ణురావు,వేంకట్, సి.వినయ్,రాజు, సుదర్శన్ రెడ్డి,మంగలి విష్ణు,మధు, మోదలగు వారు పాల్గోన్నారు.

# కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేత



**అల్వాల్, జూన్ 19 ( నినాదం న్యూస్)** మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కౌకూర్ భరత్ నగర్ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మచ్చ బొల్లారం డివిజన్ భరత్ నగర్,కౌకూర్ లో సీసీ రోడ్లు వేయించాలని డ్రైనేజ్ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని, కౌకూర్ బస్టాండ్ నుండి భరత్ నగర్ వరకు తారు రోడ్డు వేయించాలని ఎమ్మెల్యే గారికి వినతి పత్రం తెలిపారు. అందుకుగాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు . ఈ యొక్క కార్యక్రమంలో భరత్ నగర్ కౌకూరు వాసులు తిరుపతిరావు , సత్యనారాయణ, సందీప్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్**



**భీమదేవరపల్లి జూన్ 19(నినాదం న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్ లోని తిరుమల గార్డెన్స్ లో ఈనెల 24 న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ను యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్ పిలుపునిచ్చారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాబ్ మేళాలో 60 కి పైగా ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని, సుమారు 5000 పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు అన్నారు. విద్యార్హతలు 10 తరగతి నుండి డిగ్రీ తో పాటు వృత్తి విద్య కోర్సులు చేసిన వారికి, వారి అర్హతను బట్టి ఇంటర్వ్యూ నిర్వహించి వెంటనే ఉద్యోగాల్లో చేర్చుకోవడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నాల మురళి, బొల్లంపల్లి షెడ్రక్, నేతుల మోహన్, పూర్ణచందర్, బొల్లంపల్లి రాజు, హరికృష్ణ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరులో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**భీమదేవరపల్లి జూన్ 19 (నినాదం న్యూస్) :** హుస్నాబాద్ నియోజకవర్గం లోని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ,మాజీ మండల అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్, సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, పొన్నాల మురళి, పచ్చునూరి కర్నాకర్ గుడికందుల రాజు, పోగుల శ్రీకాంత్, మణిదీప్, అంబాల రాజ్ కుమార్, స్వర్ణలత, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి - నీట్ పరీక్ష, అవకతవకలపై కేంద్ర మంత్రులు స్పందించాలి - ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**



**జమ్మికుంట, జూన్ 20 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేసి ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీ చేస్తూ అక్షరాలతో విద్య వ్యాపారం చేస్తున్నారని, ఫీజుల దోపిడీ అరికట్టుటకు ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై, పేపర్ లీకేజి లపై సుప్రీం కోర్టు జడ్జి తో విచారణ జరిపించాలని 24లక్షల విద్యార్థుల జీవితాలతో ఎన్టిఏ నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధాని మోడీ ఇప్పటికీ స్పందించకపోవడం సిగ్గు చేటని, కేంద్ర మంత్రులు బండి సంజయ్,కిషన్ రెడ్డి నీట్ విద్యార్థులకు జరిగిన అన్యాయం పై మాట్లాడకపోవడం సరికాదని వారు నీట్ పరీక్ష మళ్ళీ నిర్వహించేలా కేంద్రం పై రాష్ట్రం నుండి ఉన్న కేంద్ర మంత్రులు ఒత్తిడి తేవాలని లేనిపక్షంలో వారిని రాష్ట్రంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు సకాలంలో విడుదల చేయటంలో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడరని ప్రస్తుతం విద్యా సంవత్సరం పూర్తి అయిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెళితే కళాశాల యాజమాన్యాలు రియంబర్స్మెంట్ రాలేదని ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులకు చెప్తున్నాయని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఫీజు రియంబర్స్మెంట్ రాకపోవడంతో బడ్జెట్ కళాశాలలు సైతం కళాశాల భవన కిరాయిలు కట్టలేక, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండి పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలో ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడి ఫీజుల దోపిడీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు యూనిఫాం లు అమ్ముతున్న వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు ఫీజుల దోపిడీని అరికట్టడంలో పూర్తిగా విఫలం అయ్యారని , ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నీట్ పరీక్షలలో అవకతవకలు, పేపర్ లీకేజి లు జరిగి దేశంలో 24లక్షల మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారిన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రధాని మోడీ ఇప్పటికీ మాట్లాడకపోవడం సిగ్గుచేటని, బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే నీట్ లీకేజీలు జరిగాయని రాష్ట్రాల స్వయంప్రతిపత్తినీ దెబ్బ తీసే విధంగా నీట్ నిర్వహణ ఉందని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పిన కేంద్రం పట్టించుకోవడం లేదని నీట్ పరీక్షను ఏ రాష్టం వారు వారే నిర్వహించుకునేల కేంద్రం నిర్ణయం చేయాలని, నీట్ లీకేజి పై,అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించి, ఎన్టీఏ జనరల్ డైరెక్టర్ ను భర్తరఫు చేసి నీట్ పరీక్ష మళ్ళీ నిర్వహించాలని తెలంగాణ నుండి కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్,కిషన్ రెడ్డి గార్లు నీట్ పరీక్ష మళ్ళీ నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని లేనిపక్షంలో వారిని తెలంగాణ లో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాపు వెంకటేష్, జిల్లా కోశాధికారి ఆలువాల విష్ణు, నాయకులు అనిల్ కుమార్ , తౌకీర్, అనిల్ రెడ్డి, సాయి, వంశీ , గణేష్ తదితరులు పాల్గొన్నారు